సాక్షి సిద్దిపేట

మంగళవారం, 14, అక్టోబర్, 2025



వడ్డీవ్యాపారుల నయా దందా

వడ్డీ వ్యాపారుల కొత్త దందా.. ఆస్తులను తమ పేరుపై రిజిస్ట్రేషన్ చేయించుకుని అప్పులు ఇస్తున్నారు. వివరాలు 8లో ▸



ఫంక్షన్ హాళ్లపై పట్టింపేదీ?

గ్రామాల్లో ఫంక్షన్ హాళ్ల నిర్మాణాలు అర్ధంతరంగా నిలిచిపోయాయి. ఏళ్లు గడిచినా మోక్షం కలగడంలేదు. వివరాలు 9లో ▸

161 దరఖాస్తులు

సిద్దిపేటకమాన్: జిల్లాలోని మద్యం దుకాణాల నిర్వహణకు ఇప్పటివరకు 161 దరఖాస్తులు వచ్చినట్లు ఈఎస్ శ్రీనివాస మూర్తి తెలిపారు. సోమవారం రోజు 66 దరఖాస్తులు వచ్చాయన్నారు. సిద్దిపేట సర్కిల్‌లో 50, గజ్వేల్‌లో 33, హుస్నాబాద్‌లో 49, చేర్యాలలో 27, మిరుదొడ్డిలో 2 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు.

న్యూస్‌రీల్

దుబ్బాక బస్‌డిపోను పూర్తిస్థాయిలో పునరుద్ధరించండి

ఆర్టీసీ ఎండీకి ఎంపీ రఘునందన్ విజ్ఞప్తి



ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని కలిసి విన్నవిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు

దుబ్బాక: స్థానిక బస్‌డిపోను పూర్తిస్థాయిలో పునరుద్ధరించాలని ఎంపీ మాధవనేని రఘునందన్‌రావు కోరారు. ఈ మేరకు సోమవారం హైదరాబాద్‌లోని బస్ భవన్‌లో ఆర్టీసీ ఎండీ నాగిరెడ్డిని కలిసి ఎంపీ విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1998లో 54 బస్‌లతో డిపో ప్రారంభించారని 134 మంది సిబ్బంది ప్రతిరోజు 14,014 కిలోమీటర్ల ప్రయాణంతో రూ.8 లక్షల దినసరి ఆదాయం సాధించిందన్నారు. నష్టాల సాకుతో 2006లో దుబ్బాక డిపోను మూసి వేయడంతో పెద్ద ఎత్తున ప్రజలు, ప్రజాప్రతినిధుల నిరసనలతో వారం రోజుల్లోనే మళ్లీ పునః ప్రారంభించారన్నారు. ప్రస్తుతం 35 బస్‌లతో రాష్ట్రంలో ఆదాయపరంగా ముందున్న డిపోలలో దుబ్బాక ఒకటన్నారు. డిపోకు డీఎంను నియమించి 60 బస్‌లను కేటాయించి పూర్తిస్థాయి డిపోగా మార్చాలని ఎండీకి విన్నవించారు. దుబ్బాక డిపో నుంచి నిజామాబాద్, శ్రీశైలం, కరీంగనర్, వేములవాడ, యాదగిరిగుట్ట తదితర రూట్లలో కొత్త బస్‌లు ప్రారంభించాలని ఎండీ నాగిరెడ్డిని కోరినట్లు ఎంపీ తెలిపారు.

బంద్ ప్రశాంతం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): జిల్లాలో బంద్ ప్రశాంతంగా కొనసాగింది. రాష్ట్రంలో బీసీలకు 42శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కోరుతూ జిల్లాలోని బీసీ సంఘాల నాయకులు ఇచ్చిన పిలుపు మేరకు సోమవారం ప్రైవేట్ విద్యా సంస్థలు బంద్ పాటించాయి. సోమవారం కొన్ని ప్రైవేట్ పాఠశాలలు పూర్తి స్థాయిలో, మరిన్ని పాక్షికంగా బంద్ చేపట్టాయి.

రిజర్వేషన్లు అడ్డుకుంటే బుద్ధిచెప్పడం ఖాయం

జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు యాదగిరి



వర్గల్(గజ్వేల్): బీసీ బిల్లు అమలుపై అన్ని వర్గాలు కలిసిరావాలని, బిల్లు అడ్డుకునే రాజకీయ శక్తులకు తగిన బుద్ధి చెబుతామని జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షుడు కొట్టాల యాదగిరి అన్నారు. సోమవారం వర్గల్ మండలం గౌరారంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 42 శాతం రిజర్వేషన్ అంశంపై అన్ని పార్టీలు సంపూర్ణ మద్దతు ప్రకటించి, అందుకు కట్టుబడాలన్నారు. బీసీ రిజర్వేషన్ బిల్లుపై కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి కపట ప్రేమ చూపిస్తున్నారని, బీసీ బిడ్డ బండి సంజయ్ స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుప్రీం కోర్టులో స్పెషల్ లీవ్ పిటిషన్ వేయడం శుభ పరిణామమన్నారు. సుప్రీంకోర్టులో బీసీలకు న్యాయం జరుగుతుందని విశ్వసిస్తున్నట్లు తెలిపారు. పార్టీలన్నీ చౌకబారు విమర్శలు మానుకుని కలిసిరావాలని సూచించారు.

హమాలీల సమస్యలు పరిష్కరించండి



మాట్లాడుతున్న గోపాలస్వామి

చేర్యాల(సిద్దిపేట): హమాలీ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కాముని గోపాలస్వామి డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలో హమాలీ కార్మిక సంఘం ముఖ్య కార్యకర్తల సమావేశం రేపాక కుమార్ అధ్యక్షతన పట్టణంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన గోపాలస్వామి మాట్లాడుతూ దేశ సంపదను సృష్టించడంలో హమాలీలు కీలక పాత్ర పోషిస్తున్నా అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం వారిని పట్టించుకోవడం లేదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో పని చేస్తున్న హమాలీలకు లారీ ఓనర్లు ఇచ్చే తాడుకట్టే వేతనం పెంచాలని సూచించారు. వారికి ప్రమాద బీమా, పని భద్రత, కనీసవేతనం, 55 ఏళ్లు దాటిన వారికి పింఛన్ సదుపాయాలను కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా రైతు సంఘం సహాయ కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శెట్టిపల్లి సత్తిరెడ్డి, రైతు సంఘం జిల్లా కార్యదర్శి వెంకట్ మావో, హమాలీ కార్మిక నాయకులు పాల్గొన్నారు.

ఎవరి చేతికో పగ్గాలు!

డీసీసీ అధ్యక్ష రేసులో పలువురు
- ఆశావహుల నుంచి అధిష్టానం దరఖాస్తుల స్వీకరణ
- ఎవరికి వారే ముమ్మర ప్రయత్నాలు
- జిల్లా పరిశీలకురాలిగా ఏఐసీసీ నుంచి జ్యోతి రౌటేలా
- నేటి నుంచి బ్లాక్‌ల వారీగా సమావేశాలు



కాంగ్రెస్‌లో పదవుల పండుగ మొదలైంది. జిల్లా కాంగ్రెస్ కమిటీ (డీసీసీ)అధ్యక్షులను నియమించి పార్టీని బలోపేతం చేసేందుకు పార్టీ అధిష్టానం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా జిల్లా అధ్యక్షుని ఎంపిక కోసం కసరత్తు ప్రారంభించారు. రాష్ట్రంలో పార్టీ అధికారంలో ఉండటంతో డీసీసీ పదవికి డిమాండ్ పెరిగింది. పదవిని ఆశిస్తున్న నేతలు తమ ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

–సాక్షి, సిద్దిపేట

డీసీసీ అధ్యక్షుడి ఎంపిక కోసం ఏఐసీసీ నుంచి జ్యోతి రౌటేలా, పీసీసీ నుంచి జగదీశ్వర్ రావు, నజీర్ హుస్సేన్‌లను నియమించారు. ఈ నెల 14 నుంచి 17వ తేదీ వరకు జిల్లాలో పరిశీలకుల బృందం సమావేశాలు నిర్వహించనుంది. ఆశావహుల నుంచి దరఖాస్తుల స్వీకరణ, మండల అధ్యక్షులతో సమావేశమై అందరి అభిప్రాయాలను సేకరించనున్నారు. అనంతరం డీసీసీ అధ్యక్ష పదవికి అర్హతలు ఉన్న నేతల పేరును పీసీసీ ద్వారా ఏఐసీసీకి పంపించనున్నారు.

నేటి నుంచి సమావేశాలు

డీసీసీ అధ్యక్షుడు ఎంపిక కోసం పరిశీలకులు నియోజకవర్గాలు, బ్లాక్‌ల వారీగా సమావేశాలు నిర్వహించనున్నారు. మంగళవారం ఉదయం దుబ్బాక బ్లాక్‌కు సంబంధించి దుబ్బాక పట్టణంలోని రెడ్డి ఫంక్షన్ హాల్, మధ్యాహ్నం దౌల్తాబాద్ బ్లాక్ తొగుటలోని చెరుకు బాలమ్మ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించనున్నారు. అలాగే 15న హుస్నాబాద్ పట్టణం, 16న సిద్దిపేట బ్లాక్ ఇర్కోడ్‌లోని లావణ్య గార్డెన్, మధ్యాహ్నం నంగునూరులో, 17న ఉదయం వర్గల్ మండలం శాకారం, మధ్యాహ్నం గజ్వేల్ పట్టణంలో సమావేశాలు, అభిప్రాయ సేకరణ చేపట్టనున్నారు.

ఆశావహులు ఎక్కువే..



తూంకుంట నర్సారెడ్డి | దరిపల్లి చంద్రం | గాడిపెల్లి రఘువర్ధన్ రెడ్డి | పూజల హరికృష్ణ | గిరి కొండల్‌రెడ్డి

ప్రస్తుత డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డిపై ఇటీవల పీసీసీ క్రమశిక్షణ కమిటీకి పలువురు ఫిర్యాదులు చేశారు. ఈ ఫిర్యాదులపై పీసీసీ క్రమశిక్షణ కమిటీ వివరణ సైతం తీసుకుంది. తనకే మరోమారు డీసీసీ పదవి ఇవ్వాలని నర్సారెడ్డి కోరుతున్నట్లు సమాచారం.

- సిద్దిపేట నియోజకవర్గ ఇన్‌చార్జి పూజల హరికృష్ణ కూడా డీసీసీ పదవి ఆశిస్తున్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్‌లో వివిధ పదవులను హరికృష్ణ నిర్వర్తించారు.
- పీసీసీ సభ్యుడు దరిపల్లి చంద్రం సైతం తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. సిద్దిపేట నియోజకవర్గం నుంచి పార్టీ టికెట్ కోసం చివరి వరకు ప్రయత్నించారు. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జిల్లాలో దరిపల్లి చంద్రం పలు కార్యక్రమాలు నిర్వహించారు. బీసీ, కార్మిక సంఘ నాయకుడిగా ఉన్న తనకు డీసీసీ అధ్యక్ష పదవినీ ఇవ్వాలని పట్టుబడుతున్నారు.
- ఎన్ఆర్ఐ గాడిపెల్లి రఘువర్ధన్ రెడ్డి సైతం డీసీసీ అధ్యక్ష పదవి రేస్‌లో ఉన్నారు. ఎన్ఎస్‌యూఐ, యూత్ కాంగ్రెస్, కాంగ్రెస్ ఎన్ఆర్ఐ సెల్‌లో వివిధ పదవులతో పాటు గాడిపెల్లి ట్రస్ట్ పేరుతో వివిధ సేవ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. తనకు డీసీసీ అధ్యక్ష పదవి ఇవ్వాలని ఇప్పటికే పార్టీ పెద్దలను కలిసి కోరారు.
- జెడ్పీ మాజీ ఫ్లోర్‌లీడర్ గిరి కొండల్‌రెడ్డి కూడా తనకు అవకాశం ఇవ్వాలని కోరుతున్నారు. గత జెడ్పీటీసీ ఎన్నికల్లో ఏకైక కాంగ్రెస్ జెడ్పీటీసీగా మద్దూరు నుంచి గెలుపొందారు.
- గజ్వేల్‌కు చెందిన పార్టీ నాయకుడు బండారు శ్రీకాంత్, సిద్దిపేట పట్టణ అధ్యక్షుడు అత్తు ఇమామ్‌లు సైతం ఆశలు పెట్టుకున్నారు.
- అధిష్టానం మెప్పుపొంది అధ్యక్ష పీఠంపై ఆసీనులయ్యేందుకు ఎవరికి వారు మంతనాలు సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో డీసీసీ అధ్యక్షుడి పదవి ఎవరిని వరిస్తుందో అని జిల్లాలో జోరుగా చర్చసాగుతోంది.

అర్జీలు సత్వరం పరిష్కారం



కలెక్టరేట్‌లో అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హైమావతి

- కలెక్టర్ హైమావతి
- ప్రజావాణిలో అర్జీల స్వీకరణ

సిద్దిపేటరూరల్: ప్రజావాణిలో ప్రజలు అందిస్తున్న అర్జీలను సత్వరం పరిష్కరించేందుకు చర్యలు చేపడుతున్నట్లు కలెక్టర్ హైమావతి తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని మీటింగ్ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజలు అందించిన అర్జీలను కలెక్టర్ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఎలాంటి జాప్యం లేకుండా వెంటవెంటనే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. వివిధ రకాల సమస్యల పరిష్కారం కోరుతూ మొత్తంగా 114 అర్జీలు వచ్చాయి. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు గరీమా అగర్వాల్, అబ్దుల్‌హమీద్, డీఆర్‌ఓ నాగరాజమ్మ, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ భవ్య, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు రావొద్దు

కోహెడరూరల్(హుస్నాబాద్): ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని వసతులు ఏర్పాటు చేయాలని కలెక్టర్ హైమావతి కొనుగోలు కేంద్రాల సిబ్బందికి సూచించారు. సోమవారం మండలంలోని శనిగరం గ్రామంలోని ధ్యానం కొనుగోలు కేంద్రాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొనుగోలు కేంద్రానికి వచ్చిన ధ్యానాన్ని వెంట వెంటనే రైస్ మిల్లుకు తరలించాలని ఆదేశించారు. తేమ శాతం రాగానే బస్తాలను అందించాలని అన్నారు.

పరిశుభ్రతపై అవగాహన తప్పనిసరి

కోహెడ(హుస్నాబాద్): పరిసరాల పరిశుభ్రతపై గ్రామాలలోని ప్రజలకు క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని కలెక్టర్ హైమావతి ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బందిని ఆదేశించారు. సోమవారం స్థానిక ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా డెంగీ, మలేరియా కేసులపై ఆరా తీశారు. రోగులకు అన్నిరకాల మందులు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఆస్పత్రులకు అన్నిరకాల మందులు సరఫరా చేయాలని డీఎంహెచ్‌ఓను ఫోన్ ద్వారా ఆదేశించారు. ఆస్పత్రి పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో సిబ్బందిపై మండిపడ్డారు. ఈ సందర్భంగా రోగులతో మాట్లాడుతూ కాచిచల్లార్చిన నీటిని తాగాలని, వేడివేడి ఆహారాన్ని తీసుకోవాలని సూచించారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

నంగునూరు(సిద్దిపేట): నాణ్యమైన సరుకులతో మెనూ ప్రకారం విద్యార్థులకు మధ్యాహ్న భోజనం అందించేలని కలెక్టర్ హైమావతి అన్నారు. సోమవారం బద్దిపడగ ఉన్నత పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి మెనూ పాటించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. పాఠశాల హెచ్‌ఎం పద్మ వంట సరుకులు, కూరలను పరిశీలించడంలేదని, స్లాబ్ నుంచి నీరు కారుతున్నా పట్టించుకోవడంలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే చర్యలు తీసుకోవాలని డీఈఓను ఫోన్‌లో ఆదేశించారు. పాఠశాలలో రోజు అందించే మెనూ వివరాలను అడిగి తెలుసుకొని విద్యార్థులతో కలసి అక్కడే భోజనం చేశారు. క్రమశిక్షణ, చక్కని అలవాట్లు అలవర్చుకొని, ఒక లక్ష్యంతో చదివి ప్రయోజకులు కావాలని విద్యార్థులకు సూచించారు.



విద్యార్థులకు కూరను వడ్డిస్తున్న కలెక్టర్ హైమావతి

ఆయిల్‌పామ్ సాగుతో లాభాలు అధికం



ఆయిల్‌పామ్ సాగుపై అవగాహన కల్పిస్తున్న మానిటరింగ్ అధికారి రాములు

మిరుదొడ్డి(దుబ్బాక): దీర్ఘకాలికంగా సాగు చేసే అయిల్‌పామ్ పంటలతో అధిక లాభాలు సాధించవచ్చని ఆయిల్‌ఫెడ్ ప్లాంట్ మానిటరింగ్ ఆఫీసర్ రాములు అన్నారు. మండల కేంద్రమైన మిరుదొడ్డిలో రైతు అంజిరెడ్డి సాగు చేస్తున్న ఆయిల్‌పామ్ సాగును సోమవారం రైతులతో కలిసి ఆయన పరిశీలించారు. ఆయిల్‌పామ్ గెలలను ఎలా హార్వెస్టింగ్ చేయాలి? నీటి యాజమాన్య పద్ధతులు, ఎరువుల యాజమాన్యంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం అయిల్‌పామ్ గెలలు టన్నుకు రూ.19,400 ధర పలుకుతోందన్నారు. ఇతర పంటలతో పోలిస్తే అయిల్‌పామ్ తోటల్లో కోకో వంటి అంతర పంటలు సాగు చేస్తే అదనంగా రూ.లక్ష వరకు ఆదాయాన్ని పొందవచ్చన్నారు. ఎకరానికి నికరంగా ప్రతి సంవత్సరం 10 టన్నుల ఆయిల్‌పామ్ దిగుబడిని పొందవచ్చని తెలిపారు. ఆయిల్‌ఫెడ్ ఆధ్వర్యంలో మార్కెటింగ్ సదుపాయాన్ని కల్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో ఆయిల్‌పామ్ ఫీల్డ్ అసిస్టెంట్ ఆంజనేయులు, రైతులు వెంకట్ రెడ్డి, రామస్వామి, యాదగిరి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ అందిస్తాం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): నిరంతరం నాణ్యమైన విద్యుత్ సరఫరా అందించేందుకు కృషి చేస్తున్నామని ట్రాన్స్‌కో ఓఎంసీ ఎస్ఈ బలరాంనాయక్ తెలిపారు. జిల్లా ట్రాన్స్‌కో ఓఎంసీ (ఆపరేషన్ అండ్ మేనేజ్‌మెంట్ సెంటర్)గా సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా వివిధ ఉద్యోగ, కార్మిక సంఘాల నాయకులు బాలరాంనాయక్‌ను కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారులకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో విద్యుత్ ఉద్యోగులు, కార్మిక సంఘాల నాయకులు తదితరలు పాల్గొన్నారు



కలెక్టరేట్ ఎదుట ధర్నాచేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

సీజేఐపై దాడి దుర్మార్గం

సిద్దిపేటరూరల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై జరిగిన దాడి దుర్మార్గమైన చర్య అని ఎమ్మార్పీఎస్ జిల్లా ఇన్‌చార్జి మందకుమార్ అన్నారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దాడిని రాజ్యాంగం మీద జరిగిన దాడిగానే భావించాలన్నారు. ఈ ఘటన దళిత, పీడిత వర్గాల ప్రజలను తీవ్ర మనోవేదనకు గురి చేసిందన్నారు. దాడికి పాల్పడ్డ వ్యక్తిపై తక్షణమే కేసు నమోదు చేసి అరెస్టు చేయాలన్నారు. అనంతరం అదనపు కలెక్టర్ అబ్దుల్ హమీద్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా కో ఇన్‌చార్జి యాదగిరి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానం.. కొత్త ఉత్సాహం

- ప్రణాళిక–2035పై కోటి ఆశలు
- ఉద్యాన పంటల హబ్‌గా ఉమ్మడి మెదక్ జిల్లా
- సహకారం లేక రైతుల్లో నిరాశ
- ప్రభుత్వం చేయూతనిస్తే సాగు మరింత విస్తరణ



గజ్వేల్ ప్రాంతంలో కూరగాయల సాగు

గజ్వేల్: ములుగులోని కొండా లక్ష్మణ్ తెలంగాణ హార్టికల్చర్ యూనివర్సిటీ ఈనెల 9న విడుదల చేసిన 'ఉద్యాన పంటల ప్రణాళిక–2035'పై ఆశలు చిగురించాయి. కొంత కాలంగా ఉద్యాన పంటల సాగు ప్రోత్సాహంపై స్తబ్దత నెలకొన్న తరుణంలో తాజాగా ప్రభుత్వ ప్రకటనతో కొత్త ఉత్సాహం నెలకొన్నది. ప్రభుత్వ సహకారం పెరిగితే ప్రత్యేకించి ఉద్యాన పంటలకు హబ్‌గా ఉన్న ఉమ్మడి జిల్లాలో సాగు మరింతగా విస్తరించనున్నది.

ఉమ్మడి మెదక్ జిల్లా ఉద్యాన పంటల (కూరగాయలు, పండ్లు, పూలు)కు హబ్‌గా మారింది. 40కిపైగా మండలాల్లో భారీగా ఉద్యాన పంటలు సాగవుతున్నాయి. పదిహేనేళ్ల కిందట కేవలం 10వేల ఎకరాలకే పరిమితమైన ఉద్యాన పంటలు ప్రస్తుతం 2.5లక్షల ఎకరాల్లో సాగులోకి వచ్చాయి. ఈ ప్రాంతం నిత్యం నుంచి వేలాది టన్నులు కూరగాయలు హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, మహారాష్ట్రలోని, చంద్రాపూర్, కలకత్తా తదితర రాష్ట్రీయ మార్కెట్లకు ఎగుమతి అవుతున్నాయి.


ప్రభుత్వ సహకారం లేక ..

ఉద్యాన పంటలకు ప్రభుత్వం నుంచి సరైన సహకారం లేకపోవడంతో రైతులను నిరాశకు గురి చేస్తున్నది. విత్తన సబ్సిడీ కనుమరుగవటం, పందిరి, పాలీహౌస్ పథకాలకు చేయూత లేకపోవడంతోపాటు సలహాలు, సూచనలు అందించేందుకు క్షేత్రస్థాయిలో తగినంతగా ఉద్యానశాఖ సిబ్బంది లేకపోవడం ఆందోళన కలిగిస్తున్నది.

యూనివర్సిటీ కీలక సూచనలు..

- ఉద్యాన ప్రణాళికలో ప్రభుత్వానికి హార్టికల్చర్ యూనివర్సిటీ కీలకమైన సూచనలు చేసింది. ప్రధానంగా ఉమ్మడి మెదక్ జిల్లాకు సంబంధించిన పలు అంశాలేకాకుండా, రాష్ట్రంలోని ఉద్యాన రైతులకు ఉపయోగపడే సూచనలు ఉన్నాయి.
- ఉద్యాన పంటల ధరల ముందస్తు సూచనలపై మార్కెటింగ్ ఇంటెలిజెన్స్ కేంద్రాన్ని ములుగు యూనివర్సిటీలో ఏర్పాటు చేసి మార్కెటింగ్ శాఖ భాగస్వామ్యంతో నిర్వహించేలా చూడాలని సూచనలు చేశారు.
- వంటిమామిడి లాంటి కూరగాయల మార్కెట్ యార్డుల్లో క్రయవిక్రయాలు సక్రమంగా జరిగేలా చూడాలని నిర్దేశించారు.
- కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉద్యాన పథకాలు, ఫుడ్ ప్రాసెసింగ్ నిధులు వినియోగించుకోవాలని నిర్ణయించారు. పదేళ్లుగా కేంద్ర ప్రభుత్వ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి మ్యాచింగ్ గ్రాంట్ విడుదల చేయలేదు. అందువల్ల పథకాల అమలు నిలిచిపోయింది. ఇక నుంచి మ్యాచింగ్ గ్రాంట్ నిధులు విడుదల చేసి రైతులకు పథకాలను చేరువ చేయాలని ప్రణాళికలో ప్రభుత్వానికి సిఫార్సు చేశారు.
- ఎంఐడీహెచ్(మిషన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ ఆఫ్ హార్టికల్చర్), ఎన్‌హెచ్‌ఎం (నేషనల్ హార్టికల్చర్ మిషన్), హెచ్‌సీడీపీ (హార్టికల్చర్ క్లస్టర్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం)లను వాడుకోవాలని సూచించారు.
- ప్రతి ఎకరానికి పెట్టుబడి ఖర్చు తగ్గించి, ఉత్పాదకతను పెంచడంతోపాటు.. మార్కెటింగ్ సౌకర్యాలను పెంచడం, కోల్డ్ స్టోరేజీల ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు.
- ప్రతి మండల కేంద్రంలో వ్యవసాయ యంత్రాల కోసం ఒక కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటు చేసి, రైతులకు సకాలంలో పనులు పూర్తయ్యేలా చూడాలని యూనివర్సిటీ సూచించింది. ఇవే కాకుండా మరెన్నో అంశాలను ప్రభుత్వానికి ప్రణాళికలో సిఫార్సు చేసింది.

ఉద్యాన సాగును పెంచుదాం



ఉద్యాన పంటల సాగును పెంచడమే లక్ష్యంగా ఉద్యాన ప్రణాళిక–2035ని రూపొందించాం. ప్రభుత్వం ఈ ప్రణాళిక అమలుకు సుముఖంగా ఉంది. వచ్చే రోజుల్లో కూరగాయలు, పండ్లు, పూల సాగుకు ప్రోత్సాహం పెరగనుంది.

– రాజిరెడ్డి, వైస్ ఛాన్సలర్, హార్టికల్చర్ యూనివర్సిటీ

చెరువులో స్తంభం ఎక్కి..

తెగిన కరెంటు తీగలు బిగించి..



తీగలను బిగిస్తున్న విద్యుత్ సిబ్బంది

వర్గల్(గజ్వేల్): జలాశయాల్లో కరెంటు తీగలు తెగిపడిన సందర్భాల్లో మరమ్మతు పనులు, విద్యుత్ సరఫరా పునరుద్ధరణకు సిబ్బంది సాహసమే చేయాల్సివస్తున్నది. సోమవారం ఉదయం నెంటూరు 33 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని జబ్బాపూర్ 11కేవీ ఫీడర్ బ్రేక్‌డౌన్ అయింది. దీంతో లైన్ ఇన్‌స్పెక్టర్ చంద్రయ్య, క్యాజువల్ లేబర్ సతీష్, మీటర్ రీడర్ ధర్మయ్యలు రంగంలోకి దిగారు. ఫీడర్ లైన్ వెంట తనిఖీలు నిర్వహించారు. మైలారం చింతల చెరువులో స్తంభాల మధ్య కరెంట్ తీగ(కండక్టర్) తెగిపోయినట్లు గుర్తించారు. నడుము లోతు నీటిలో 4, 5 గజాల కొత్త కండక్టర్ తీగను తీసుకొని స్తంభం వద్దకు చేరుకున్నారు. బైండింగ్ చేసి తీగను అతికి విద్యుత్ లైన్‌ను యథావిధిగా బిగించారు. గంటన్నర వ్యవధిలో మరమ్మతులు పూర్తిచేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించారు. 'వెల్‌డన్.. నెంటూర్ స్టాఫ్' అంటూ అందరి ప్రశంసలు చూరగొన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన సీపీ

సిద్దిపేటకమాన్: జిల్లా ప్రధాన న్యాయమూర్తి సాయి రమాదేవిని పోలీసు కమిషనర్ విజయ్‌కుమార్ సోమవారం మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందజేశారు. అనంతరం న్యాయమూర్తి జయప్రసాద్‌ను కూడా కలిశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల గురించి చర్చించుకున్నారు.

క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్ చంద్రబోస్



మాట్లాడుతున్న డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్

హవేళిఘణాపూర్(మెదక్): యువకులు సైబర్ నేరాలు, డ్రగ్స్ భారిన పడకుండా తమ బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని సైబర్ క్రైమ్ డీఎస్పీ సుభాష్‌చంద్రబోస్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని ముత్తాయికోటలో విద్యార్థులు నిర్వహిస్తున్న ఎన్ఎస్ఎస్ శిబిరంలో పాల్గొని మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మత్తు పదార్థాలకు బానిసై ఎందరో తమ ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని తెలిపారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930 కు కాల్ చేసి ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ మురళి, డాక్టర్ శరత్, సాయికిరణ్, నాగరాజు, హెచ్ఎం రఘుబాబు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం స్వాధీనం



పట్టుబడిన రేషన్ బియ్యం

శివ్వంపేట(నర్సాపూర్): అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యాన్ని సీసీఎస్ పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమ వారం మండల పరిధిలోని పాంబండలో సీసీఎస్ పోలీసులు దాడులు చేసి ఓ పౌల్ట్రీఫామ్‌లో 12 బస్తాల రేషన్ బియ్యం (6 క్వింటాళ్లు) పట్టుకున్నారు. అనంతరం రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుని శివ్వంపేట పీఎస్‌కు తరలించారు. వారి ఫిర్యాదు మేరకు సివిల్ సప్లయ్, రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టారు.

ముగ్గురు దొంగలు అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న ఎస్ఐ షేక్ మహబూబ్

మద్దూరు(హుస్నాబాద్): ధాన్యాన్ని అపహరించి తీసుకెళ్తున్న ముగ్గురిని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ ఘటన మండలంలోని కూటిగల్ గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ షేక్ మహబూబ్ కేసు వివరాలు వెల్లడించారు. గ్రామానికి చెందిన అల్ల కొమురయ్య మొక్కజొన్న పంటను కోసి ఆరబెట్టాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి హుస్నాబాద్, అక్కపేట మండలాలకు చెందిన గంటల శంకర్, పండుగ సతీశ్, బడుగు సంపత్ సుమారు 12 క్వింటాళ్ల మక్కలను అపహరించి హుస్నాబాద్‌కు తరలిస్తున్నారు. రాత్రి వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసులకు అనుమానాస్పందగా కనిపించడంతో విచారించగా దొంగిలించినట్లు ఒప్పుకున్నారు. దీంతో పోలీసులు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు.

మొబైల్ దుకాణంలో చోరీ

కౌడిపల్లి(నర్సాపూర్): మొబైల్ దుకాణంలో చోరీ జరిగింది. వివరాలు ఇలా.. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్ ఎదురుగా బస్టాండ్ సమీపంలో మహమ్మద్‌నగర్ గ్రామానికి చెందిన భరత్‌గౌడ్ భవ్య మొబైల్‌షాప్ నిర్వహిస్తున్నాడు. కాగా ఆదివారం రాత్రిషాప్ బంద్‌చేసి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం తిరిగి షాప్ తెరిచిచూడగా గుర్తుతెలియని వ్యక్తులు డబ్బా రేకు నుంచి స్క్రూలు విప్పి చోరీ చేశారు. కాగా షాప్‌లోని సీసీటీవీతోపాటు హార్డ్‌డిస్క్, మొబైల్‌కవర్లు, ఇతర చిన్న వస్తువులు చోరీ అయినట్లు బాధితుడు తెలిపారు. చోరీ జరగడం ఇది నాల్గవసారి అని, ఫోన్లు షాప్‌లో పెట్టకుండా ఇంటికి తీసుకెళుతున్నట్లు చెప్పాడు.

మద్యం మత్తులో యువకుల వీరంగం

కారుకు అడ్డుగా వెళ్లి దంపతులపై దాడి

వట్‌పల్లి(అందోల్): మద్యం మత్తులో ఇద్దరు యువకులు దంపతులపై దాడి చేశారు. ఈ ఘటన సోమవారం మండలంలోని అల్మాయిపేట వద్ద చోటుచేసుకుంది. ఎస్ఐ పాండు వివరాల ప్రకారం... టేక్మాల్ గ్రామానికి చెందిన భక్తుల వీరప్ప ఆయన సతీమణి వరలక్ష్మితో కలిసి సంగారెడ్డి నుంచి వస్తున్న క్రమంలో అందోల్ గ్రామానికి చెందిన జాఫర్, షాహిద్ బైక్‌పై వస్తూ కారును ఓవర్‌టేక్ చేశారు. ఈ క్రమంలో ముందుకు వెళ్లి బైక్‌ను కారుకు అడ్డుపెట్టి కారు నడుపుతున్న వీరప్పను బయటకు లాగి దాడి చేశారు. ఈ క్రమంలో ఆయన సతీమణిపై కూడా దాడి చేయగా అటువైపుగా వెళ్లేవారు అడ్డుకున్నారు. ఈ దాడిలో భార్యాభర్తలకు గాయాలయ్యాయి. దీంతో బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయగా ఆ ఇద్దరు యువకులను అదుపులోకి తీసుకున్నారు.

వడ్డీ వ్యాపారుల నయా దందా



భూములు రిజిస్ట్రేషన్ చేస్తేనే అప్పులు

- సర్వహక్కులు కోల్పోయే ప్రమాదం
- తేడాలొస్తే భవిష్యత్‌లో ఇబ్బందులే
- మార్టిగేజే బెటర్ అంటున్న న్యాయ నిపుణులు

గతంలో బంగారం కుదవపెట్టి, ప్రామిసరీ నోట్లు రాసిస్తే వడ్డీ వ్యాపారులు అప్పులిచ్చేవారు. కానీ ఈ మధ్యకాలంలో ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసిస్తేనే అప్పులు ఇస్తున్నారు. ఈ నయా దందాకు వడ్డీ వ్యాపారులు తెరలేపారు. అయితే ఈ విధానంతో భవిష్యత్తులో సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని న్యాయ నిపుణులు, పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. కాగా మార్టిగేజ్ చేసి బ్యాంకుల నుంచి అప్పు తీసుకుంటే తీసుకున్న వారు సేఫ్‌గా ఉంటారని చెబుతున్నారు.

– జోగిపేట(అందోల్)

జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ ఫైనాన్స్‌కు చెందిన వారు సిండికేట్‌గా ఏర్పడి జోగిపేట, సంగారెడ్డి, జహీరాబాద్, నారాయణఖేడ్ ప్రాంతాల్లోని రైతులకు, చిన్న చిన్న వ్యాపారులకు అధిక వడ్డీతో అప్పులు ఇస్తున్నారు. ఇందుకు భూములనే కాకుండా భవనాలు, కమర్షియల్ షట్టర్‌లను రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారు.

దళారులకు పండుగ

వ్యవసాయ భూమిపై అప్పులిస్తామని చెప్పి ప్రతి గ్రామంలో ఒకరిద్దరూ దళారులు ఉన్నారు. వారు అప్పు ఇచ్చే వ్యక్తులకు తీసుకునే వారిని పరిచయం చేసి డబ్బులు ఇప్పించి రిజిస్ట్రేషన్ వరకు ప్రధాన బాధ్యత తీసుకుంటారు. ఇలా రిజిస్ట్రేషన్ చేయించినప్పుడు 2 శాతం కమీషన్‌ను తీసుకుంటున్నారు.

ఇటీవల ఓ ఘటన

దాకూరు గ్రామానికి చెందిన బోయిని కృష్ణ అందోలు మండలంలోని కొంత మంది రైతులకు, ప్రైవేట్ వ్యక్తులకు అప్పులిచ్చి భూములను తన పేర రిజిస్ట్రేషన్ చేయించుకున్నాడు. ఆ తర్వాత ఇదే భూమిని రూ.50 లక్షలు, కోటి రూపాయల వరకు ఇతరులకు అమ్ముకున్నాడు. అప్పు తీసుకున్న రైతులు లబోదిబోమన్నారు. ఇప్పటి వరకు రూ.20 కోట్ల వరకు రిజిస్ట్రేషన్ చేయించుకుని ఉడాయించాడు. దాకూరు గ్రామానికి చెందిన భాగయ్య కృష్ణపై కేసు పెట్టాడు. కాగా ఆరు మాసాలుగా కృష్ణ పరారీలో ఉన్నాడు.

భూమి వాల్యూ తక్కువతోనే..

అధికారికంగా భూముల విలువ తక్కువగా ఉండటంతో బ్యాంకర్లు ఆ మేరకు రుణాలు ఇస్తున్నారు. ఎకరాకు రూ.2.50 లక్షల నుంచి రూ.3.60 లక్షలు మాత్రమే వాల్యూ ఉండటం వల్ల బ్యాంకర్లు భూమిని మార్టిగేజ్ చేసుకొని రూ.2 లక్షల వరకు రుణాలు ఇస్తున్నారు. ప్రైవేట్ ఫైనాన్స్ అయితే ఎకరాకు రూ.10 లక్షల నుంచి రూ. 20 లక్షల వరకు ఇస్తున్నట్లు సమాచారం. ఇక్కడ డబ్బులు తీసుకున్నప్పుడు, విడిపించుకున్నప్పుడు రిజిస్ట్రేషన్ చేసే సమయంలో ఆ ఫీజును అప్పు తీసుకున్న వ్యక్తే చెల్లించాలి. దీంతో అదనపు భారం పడటంతోపాటు భూమిపై సర్వహక్కులు కోల్పోవలసి వస్తుంది.

కేసులు పెడుతున్నాం



ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకుని అప్పులు ఇవ్వడం కరెక్ట్ కాదు. ప్రజల్ని మోసం చేసినట్లు రుజువైతే కేసులు పెడుతున్నాం. ఇటీవల దాకూరు గ్రామానికి చెందిన బోయిని కృష్ణపై ఎఫ్ఐఆర్ నమోదు చేశాం. కొన్ని సందర్భాల్లో నేరాలు జరిగే ప్రమాదం ఉంటుంది. ఎవరైనా మోసపోతే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయవచ్చు.

అనిల్‌కుమార్, సీఐ జోగిపేట.

చట్ట ప్రకారం అగ్రిమెంట్లు చెల్లవు



మార్టిగేజ్ ప్రాపర్టీస్‌కే లీగల్‌రైట్స్ ఉంటాయి. అప్పుల కోసం ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం సరికాదు. ఇంటర్నల్‌గా రెండు పార్టీలు బాండ్ పేపర్లపై, తెల్లకాగితాలపై చేసుకునే అగ్రిమెంట్లు కోర్టు అంగీకరించదు. సేల్‌డీడ్ ఉంటే ఆస్తిపై సర్వహక్కులు కోల్పోయినట్లే. అప్పు తీసుకున్న వ్యక్తి దగ్గర ఒరిజినల్ డాక్యుమెంట్ ఉన్నా.. కబ్జాలో తామే ఉన్నట్టు రుజువు చూపిస్తే కొంత వరకు సేఫ్. కోర్టులో ప్రూవ్ చేయడానికి చాలా సమయం పడుతుంది. బ్యాంకులు మార్టిగేజ్ చేసుకుంటాయి తప్పా ఆస్తులను అనుభవించవు. ప్రైవేటు వడ్డీ వ్యాపారులు ఆస్తులు రిజిస్ట్రేషన్ చేసుకోవడం మంచి విధానం కాదు. - సార వెంకటవర్మ, న్యాయవాది, జోగిపేట

బడులకు అకాడమిక్ క్యాలెండర్లు

- సెలవులు, పరీక్షలు ముందుగా తెలునుకోవచ్చు
- ప్రభుత్వ పాఠశాలకు పంపిణీ చేసిన విద్యాశాఖ

పటాన్‌చెరు టౌన్: విద్యాశాఖ ప్రభుత్వ పాఠశాలల్లో అకాడమిక్ క్యాలెండర్లు ఉంచాలని నిర్ణయించింది. ప్రతి నెలా ఎలాంటి కార్యక్రమాలు నిర్వహిస్తారు. సెలవులు, పరీక్షలు ఎప్పుడు ఉంటాయో ఉపాధ్యాయులకు తప్ప విద్యార్థులకు తెలియడం లేదు. అందుకే విద్యా సంవత్సరంలో ఏ నెలలో ఏఏ కార్యక్రమాలు నిర్వహిస్తారో అన్ని వివరాలు తెలిసేలా విద్యాశాఖ చర్యలు చేపట్టింది. 2025–26 విద్యా సంవత్సరానికి ఎస్సీ ఈఆర్టీ దీనిని రూపొందించింది. ప్రతీ పాఠశాలతోపాటు మండల విద్యాధికారి, జిల్లా విద్యాధికారి, కలెక్టర్ కార్యాలయంలో రెండేసి చొప్పున ఉంచాలని ఆదేశాలిచ్చింది. ఇప్పటికే జిల్లా పరిధిలోని ప్రైమరీ స్కూల్ 863, అప్పర్ ప్రైమరీ స్కూల్ 191, హైస్కూల్స్ 241లకు పంపిణీ చేసినట్లు డీఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

పొందుపర్చిన అంశాలు

- పరీక్షల షెడ్యూల్లో ఎఫ్ఏ–1 నుంచి పదో తరగతి వార్షిక పరీక్షల వరకు ఏయే తేదీల్లో నిర్వహించాలో, అలాగే వార్షిక షెడ్యూల్‌లో బడిబాట, పాఠశాలల పునఃప్రారంభం, పండుగలు, వేసవి సెలవులు ఇలా అన్ని వివరాలు ఉంటాయి.
- స్కూల్ ప్రిపరేషన్ మాడ్యూల్ ఒకటి నుంచి పదో తరగతి వరకు సిలబస్‌ను ఎప్పుడు పూర్తి చేయాలి. పునశ్చరణ తరగతుల నిర్వహణ వంటి వివరాలు ఉన్నాయి.
- ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు పని చేసే సమయాలను అందులో పొందుపర్చారు. ప్రతి నెలలో నిర్వహించే కార్యక్రమాలు, సముదాయ సమావేశాలు, పాఠశాల స్థాయిలో నిర్వహించే పోటీల వివరాలు, సైన్స్ ఎగ్జిబిషన్లు, సెమినార్ల వివరాలు.
- జూన్ నుంచి ఏప్రిల్ వరకు ప్రతినెల పాఠశాల పనిదినాలు ఎన్ని ఉంటాయి. పేరెంట్స్ టీచర్స్ మీటింగ్ ఎప్పుడు నిర్వహించాలో అందులో వివరంగా ఉంటాయి. కో–కరిక్యులర్ యాక్టివిటీలో ఆరోగ్యం, కంప్యూటర్, కళలు, సంస్కృతి, జీవన నైపుణ్యాలు, విలువలకు సంబంధించి వారంలో ఎన్ని పీరియడ్లు తీసుకోవాలో పొందుపర్చారు.

అందరికీ తెలిసేలా..



విద్యా సంవత్సరంలో ఏ నెలలో ఏఏ కార్యక్రమాలు నిర్వహించాలి. పరీక్షలు, సెలవులు, సమావేశాల నిర్వహణ వంటి అన్ని విషయాలు తెలిసేలా అకాడమిక్ క్యాలెండర్లు రూపొందించారు. జిల్లా పరిధిలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అకాడమిక్ క్యాలెండర్లను పంపిణీ చేశాం. దీని ద్వారా సమాచారం అందరికి సులువుగా తెలుస్తుంది.

-జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు

భద్రతా ప్రమాణాలు పాటించాలి



ప్రవీణ్ కుమార్‌కు పుష్పగుచ్ఛం ఇస్తున్న సురేందర్

రామచంద్రాపురం(పటాన్‌చెరు): ప్రతి ఒక్కరూ పనులు చేసే సమయంలో భద్రత నియమాలు పాటించాలని కార్మిక శాఖ అధికారి ప్రవీణ్ కుమార్ తెలిపారు. సోమవారం రాష్ట్ర లోక్ జనశక్తి పార్టీ రామ్‌విలాస్ లేబర్ సేల్ అధ్యక్షుడు సురేందర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్మిక చట్టాలపై అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికి కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పెంటయ్య, చారి, జనార్దన్, సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చేపల వేటకు వెళ్లి యువకుడు గల్లంతు



నదిలో గాలింపు చర్యలు చేపడుతున్న సహాయక బృందాలు (ఇన్సెట్లో)గల్లంతైన సురేశ్

కొల్చారం(నర్సాపూర్): చేపల వేటకు వెళ్లిన యువకుడు ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యాడు. ఈ ఘటన సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. కొల్చారం ఎస్ఐ హైమద్ మోహినోద్దీన్ వివరాల ప్రకారం... మండలంలోని అప్పాజీపల్లి గ్రామానికి చెందిన బుడ్డెన్నోళ్ల సురేశ్ ఆనకట్టకు నీటి ప్రవాహం తగ్గడంతో చేపల వేటకు వెళ్లాడు. ఆనకట్ట దిగువన చిన్నఘనాపూర్ పరిధిలోని మెకానికల్ బ్రిడ్జి వైపు చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు నదిలో పడి గల్లంతయ్యాడు. కొద్ది దూరంలో ఉన్న జాలరులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్ఐ మెదక్ నుంచి అగ్నిమాపక సిబ్బందితోపాటు టీజీఎఫ్ బృందాలను రప్పించి గాలించారు. చీకటి పడటంతో గాలింపు చర్యలు నిలిపివేశారు. తిరిగి మంగళవారం గాలింపు చర్యలు చేపడతామని ఎస్సై తెలిపారు.

వేర్వేరు చోట్ల ఇద్దరు అదృశ్యం



యూసుఫ్

చిలప్‌చెడ్(నర్సాపూర్): వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన మండలంలోని చండూర్ గ్రామంలో ఆలస్యంగా వెలుగుచూసింది. ఎస్ఐ నర్సింహులు వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన దూదేకుల యూసుఫ్ మద్యానికి బానిసై తరుచూ తాగి భార్య రిజ్వానాతో గొడవపడేవాడు. ఈ క్రమంలో ఈ నెల 3న తాగి వచ్చిన యూసుఫ్ భార్యతో గొడవపడ్డాడు. అనంతరం రాత్రి 9 గంటలకు కుటుంబసభ్యులతో భోజనం చేసి పడుకున్నాడు. తెల్లవారిన తరువాత చూస్తే యూసుఫ్ కనపడలేదు. దీంతో కుటుంబ సభ్యులు అతడి ఆచూకీ కోసం స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీసినా ఫలితం లేదు.

తెల్లాపూర్‌లో యువతి..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): యువతి అదృశ్యమైన ఘటన తెల్లాపూర్ మున్సిపల్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. కొమురంభీమ్ కాలనీకి చెందిన గంగమ్మ స్థానికంగా అపార్ట్‌మెంట్‌లోని ఇళ్లలో పనిచేస్తుంది. కాగా మధ్యాహ్నం ఆటోలో బయటకు వెళ్లింది. తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

బాబాయ్ దశదిన కర్మకు వెళ్లి..

- అబ్బాయ్ మృతి
- చెరువులో స్నానం చేస్తుండగా ఘటన



చిన్నరాజు

జగదేవ్‌పూర్(గజ్వేల్): బాబాయ్ దశదినకర్మకు వెళ్లి అబ్బాయ్ చెరువులో మునిగి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని తిగుల్ గ్రామంలో సోమవారం జరిగింది. ఎస్ఐ కృష్ణారెడ్డి, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సర్దగాని చిన్నరాజు(35), రజిత దంపతులు. వీరికి ముగ్గురు పిల్లలున్నారు. రాజు గ్రామంలో టెంట్ హౌస్‌లో పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. వరుసకు బాబాయ్‌లు అయినా సర్దగాని యాదగిరి, సర్దగాని నర్సయ్యల దశదినకర్మ కార్యక్రమానికి సోమవారం గ్రామంలోని కుటుంబ సభ్యులతో కలిసి మహాసముద్రం చెరువు కట్ట వద్దకు వెళ్లారు. తలనీలాలు అనంతరం చెరువులోకి దిగి స్నానం చేస్తుండగా రాజు ప్రమాదవశాత్తు నీటిలో మునిగాడు. వెంటనే కుటుంబ సభ్యులు చెరువులోకి దిగి రాజును బయటకు తీయగా అప్పటికే మృతి చెందాడు. కళ్ల ఎదుట భర్త మృతి చెందడంతో భార్యాపిల్లల రోదనలు మిన్నంటాయి. కేసు నమోదు చేసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం గజ్వేల్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

పాము కాటుతో..



పెద్ది నర్సింహా రెడ్డి

కొమురవెల్లి(సిద్దిపేట): పాము కాటుకు ఓ వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని గౌరాయపల్లిలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన పెద్ది నర్సింహారెడ్డి(57) ప్రతి రోజు మాదిరిగా వ్యవసాయ బావి వద్దకు వెళ్లాడు. చేనులో వ్యవసాయ పనులు చేస్తుండగా పాము కరిచింది. వెంటనే కుటుంబ సభ్యులు, స్థానికులు చేర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మరణించాడు.

ఎద్దు పొడిచి వృద్ధుడు..



రాజయ్య

హుస్నాబాద్‌రూరల్: ఎద్దు పొడవడంతో వృద్ధుడు మృత్యువాత పడ్డాడు. ఈ ఘటన హుస్నాబాద్ మండలం మాలపల్లిలో సోమవా రం జరిగింది. స్థానికుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన సొల్లు రాజయ్య(75) రోజులాగే బావి వద్ద పశువు లను మేతకు విడిచే క్రమంలో ఎద్దు పొడవడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మరణించాడు. గమనించిన చుట్టు పక్కల రైతులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. మృతదేహాన్ని పోలీసులు హుస్నాబాద్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. భార్య బాలవ్వ ఫిర్యాదు మేరకు ఎస్సై లక్ష్మారెడ్డి కేసు నమోదు చేసుకున్నారు.

చికిత్స పొందుతూ వృద్ధుడు..

రామచంద్రాపురం(పటాన్‌చెరు): చికిత్స పొందుతూ గుర్తు తెలియని వృద్ధుడు మృతి చెందాడు. పోలీసుల వివరాల ప్రకారం... గత నెల 30న రాత్రి రామచంద్రాపురం పట్టణంలో ఆర్టీసీ డిపో సమీపంలో గుర్తుతెలియని వృద్ధుడు అపస్మారక స్థితిలో పడి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని వృద్ధుడిని పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. కాగా చికిత్స పొందుతూ ఈనెల 11న రాత్రి మృతి చెందాడు. అతడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదని పోలీసులు తెలిపారు.

మృతదేహం లభ్యం

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని రత్నాపూర్ గ్రామ శివారు అటవీ ప్రాంతంలో గుర్తు తెలియని మృతదేహం లభ్యమైంది. గుర్తించిన పశువులు కాపరులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఎస్సై మధుకర్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహన్ని నర్సాపూర్ ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. మతిస్థిమితం లేని వ్యక్తి ఇటువైపునకు వచ్చి ఆకలితో అలమటించి మృతి చెంది ఉండవచ్చని పోలీసులు భావిస్తున్నారు. మృతుడి వయ స్సు 55 సంవత్సరాలు ఉంటుందని తెలిపారు.

ప్రాణాలు తీసుకుని.. ఆవేదన మిగిల్చి..

ఉమ్మడి జిల్లాలో వేర్వేరు చోట్ల ఐదుగురు బలవన్మరణానికి పాల్పడ్డారు.

ఉరి వేసుకొని మహిళ..



విభూతి జ్యోతి

నిజాంపేట(మెదక్): ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండల కేంద్రంలో సోమవారం సాయంత్రం చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... నిజాంపేటకు చెందిన విభూతి జ్యోతి, నర్సింహులు దంపతులు కూలీ పని చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత నెలలో మహబూబ్‌నగర్‌కు కుమారుడు అనిల్‌కుమార్‌తో సహా వలస వెళ్లారు. ఈ క్రమంలో కుమారుడికి ఫిట్స్ రావడంతో వాగులో పడి చనిపోయాడు. దీంతో మనస్తాపం చెందిన జ్యోతి(41) ఇంట్లో ఎవరూ లేని సమయంలో దూలానికి చీరతో ఉరి వేసుకుంది. గమనించిన ఆమె భర్త ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలోనే చనిపోయింది.

ములుగులో వివాహిత..



అశ్విని

ములుగు(గజ్వేల్): వివాహిత ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన మండలంలోని కొక్కొండ గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్ఐ విజయ్‌కుమార్ కథనం మేరకు... దౌల్తాబాద్ మండలం కోనాయిపల్లికి చెందిన అశ్విని(26)కి కొక్కొండకు చెందిన గుండ్రెడ్డిపల్లి రవిగౌడ్‌తో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. వారికి ఇద్దరు పిల్లలు. కాగా కొద్ది రోజులుగా అశ్వినితో భర్తతోపాటు మరిది, అత్త తరుచూ గొడవపడేవారు. ఈ విషయం అశ్విని తన తండ్రికి పలుమార్లు చెప్పినప్పటికీ సర్దుకుపోవాలని సూచించేవాడు. ఈ క్రమంలో ఆదివారం రాత్రి అశ్విని ఇంట్లో ఉరివేసుకుంది. ఆమె మృతి పట్ల అనుమానం వ్యక్తం చేస్తూ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మద్యానికి బానిసై యువకుడు..



మహబూబ్

శివ్వంపేట(నర్సాపూర్): మద్యానికి బానిసైన యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండల పరిధిలోని గంగాయిపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై మధుకర్‌రెడ్డి వివరాల ప్రకారం... గ్రామానికి చెందిన మహబూబ్(25) ప్రైవేటు పరిశ్రమలో కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. మద్యానికి బానిసై కొన్నాళ్ల నుంచి విధులకు వెళ్లకపోవడంతో తల్లి చాంద్‌బీ మందలించింది. ఆదివారం సాయంత్రం కుటుంబ సభ్యులు బిజ్లిపూర్‌లో ఫంక్షన్‌కు వెళ్లి రాత్రి 11 గంటలకు ఇంటికి రాగా మహబూబ్ ఇంట్లో ఉరివేసుకుని కనిపించాడు. వెంటనే తూప్రాన్ ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో..



నెల్లూరి వెంకటేశం

కౌడిపల్లి(నర్సాపూర్): అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండలంలోని సలాబత్‌పూర్‌లో జరిగింది. ఎస్సై మురళి వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నెల్లూరి వెంకటేశ్(51) మూడేళ్ల క్రితం అప్పుచేసి కూతురు పెళ్లి చేశాడు. ఓ వైపు పెళ్లికి చేసిన అప్పులు తీరక, మరోవైపు కూతురు జీవితం బాగాలేకపోవడంతో కుటుంబ సభ్యులకు చెప్పుకుని బాధపడేవాడు. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం ఇంట్లో ఎవరులేని సమయంలో ఇంటిదూలానికి ఉరివేసుకున్నాడు.

మానసిక ఆందోళనతో..



రెడ్డి ప్రసాద్

చిన్నశంకరంపేట(మెదక్): మానసిక ఒత్తిడితో యువకుడు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని గజగట్లపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. ఎస్ఐ నారాయణగౌడ్ కథనం మేరకు... గ్రామానికి చెందిన రెడ్డి యాదగిరి కుమారుడు ప్రసాద్(20) ఇంటి వద్దే ఉంటూ పనులు చేసుకుంటున్నాడు. ఆదివారం మధ్యాహ్నం భోజనం చేసిన తరువాత బైక్ తీసుకుని ఇంటి నుంచి బయటకు వెళ్లాడు. రాత్రి ఇంటికి రాకపోవడంతో స్నేహితులు, బంధువుల వద్ద ఆరా తీశాడు. సోమవారం ఉదయం రెక్కల గుట్ట వద్ద బైక్ కన్పించడంతో గ్రామస్తులు కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. వెంటనే అక్కడికి వెళ్లి వెతకగా చెట్టుకు ఉరివేసుకుని విగతజీవిగా కనిపించాడు.

నిందితుడికి జీవిత ఖైదు

మెదక్ మున్సిపాలిటీ: ఓ కేసులో నిందితుడికి కోర్టు జీవితఖైదుతోపాటు, జరిమాన విధించింది. జిల్లా ఎస్పీ డీవీ శ్రీనివాసరావు వివరాలు... సంగారెడ్డి జిల్లా వట్‌పల్లి మండలం సేవాలాల్ తండాకు చెందిన ఫకీరానాయక్ 2020 నవంబర్ 10న జిల్లా కేంద్రంలోని ఓ కల్లు దుకాణం వద ఓ మహిళను పరిచయం చేసుకున్నాడు. ఆమెతో మాటలు కలిపి చేగుంట రోడ్ వైపు ఉన్న ధర్మకుంట సమీపంలోకి తీసుకెళ్లి కామవాంఛ తీర్చుకున్నాడు. అనంతరం ఇద్దరి మధ్య డబ్బుల విషయంలో వాగ్వాదం జరిగింది. మాటామాటా పెరగడంతో ఫకీరానాయక్ పక్కన ఉన్న బాటిల్‌ను పగులగొట్టి మహిళ గొంతు కోసి హత్య చేశాడు. ఈ ఘటనపై అప్పట్లోనే కేసు నమో దు చేసిన పోలీసులు సాక్ష్యాలను కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన జిల్లా ప్రధాన న్యాయమూర్తి నీలిమ నిందితుడికి జీవిత ఖైదుతోపాటు, రూ.15 వేలు జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు.

క్యూనెట్ కేసులో ఇద్దరు అరెస్టు

- వివరాలు వెల్లడించిన సీపీ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న సీపీ విజయ్‌కుమార్

సిద్దిపేటకమాన్: ఆన్‌లైన్‌లో పెట్టుబడులు పెట్టి మోసపోయి యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటనలో ఇద్దరు నిందితులను పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం సీపీ కార్యాలయంలో కమిషనర్ విజయ్‌కుమార్ కేసు వివరాలు వెల్లడించారు. వర్గల్ మండలం వేలూరుకు చెందిన బడుగు నాగరాజు, వజ్రమ్మ దంపతుల చిన్నకొడుకు హరికృష్ణ (26) ఓ ప్రైవేటు కంపెనీలో పనిచేస్తున్నాడు. ఏడాది క్రితం పలు ఆన్‌లైన్ యాప్స్, బెట్టింగ్‌లలో రూ.8లక్షలు పెట్టుబడి పెట్టి మోసపోయాడు. దీంతో అప్పులు తీర్చే మార్గం కోసం చూస్తుండగా.. అదే గ్రామానికి చెందిన కాల్వల మణికంఠరెడ్డి అతడికి పరిచయమయ్యాడు. క్యూనెట్ మనీ సర్క్యూలేటింగ్ ఆన్‌లైన్ గేమ్ యాప్‌లో పెట్టుబడి పెడితే లాభాలు వస్తాయని నమ్మించాడు. ఈ క్రమంలో మణికంఠరెడ్డి సమీప బంధువైన ఐటీ ఉద్యోగి అలేఖ్యను పరిచయం చేశాడు. కాగా హరికృష్ణ నుంచి రూ.4లక్షలు తీసుకుని మెంబర్‌షిప్ కల్పించారు. కొన్ని రోజుల తర్వాత హరికృష్ణ వారిని డబ్బులు అడగగా.. రూ.4లక్షలు కట్టించి ఒక్కో సభ్యుడిని సంస్థలో చేర్పిస్తే కమిషన్‌గా రూ.50 వేలు వస్తాయని తెలిపారు. దీంతో మళ్లీ మోసపోయానని గ్రహించి ఇతరులు ఎవరూ తన లాగా మోసపోకూడదని ఆవేదనకు గురై సూసైడ్ నోట్ రాసి ఈ నెల 9న ఇంట్లో హరికృష్ణ ఉరి వేసుకున్నాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇందులో భాగంగా క్యూనెట్‌లో పెట్టుబడి పెట్టేలా ప్రోత్సహించిన ఉప్పలపు అలేఖ్య, కాల్వల మణికంఠరెడ్డిలను సోమవారం అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించారు. మిగతా నిందితులను త్వరలో పట్టుకుంటామని తెలిపారు. సమావేశంలో అదనపు డీసీపీ అడ్మిన్ సీహెచ్ కుశాల్కర్, గజ్వేల్ ఏసీపీ నరసింహులు, గజ్వేల్ రూరల్ సీఐ మహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలి

యాంటీ నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సైదులు



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ

పటాన్‌చెరు టౌన్: యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండాలని యాంటి నార్కోటిక్స్ బ్యూరో డీఎస్పీ సైదులు అన్నారు. సోమవారం సాయంత్రం పటాన్‌చెరు మండలం ఐనోల్ గ్రామంలో హైదరాబాద్ బేగంపేట్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీ విద్యార్థినులతో ఎన్ఎస్ఎస్ వింటర్ క్యాంప్ నిర్వహించారు. ఈ సందర్భంగా క్యాంప్ వద్ద మాదకద్రవ్యాలతో కలిగే నష్టాలపై డీఎస్పీ అవగాహన కల్పించారు. ఎన్ఎస్ఎస్ శిబిరాలు విద్యార్థుల్లో ఆత్మవిశ్వాసం పెంచడంతో పాటు సమాజంపై అవగాహన కల్పిస్తుందన్నారు. చదువు మీరు కోరుకున్న లక్ష్యాన్ని దగ్గర చేస్తుందని తెలిపారు. ఎవరైనా మత్తు పదార్థాలకు అలవాటు పడితే పోలీసులకు, అధ్యాపకులకు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ నరసింహులు, డాక్టర్ ఎం.మధుకర్, నార్కోటిక్స్ సీఐ శ్రీనివాస్ పాల్గొన్నారు.